క్లుప్తంగా

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



బీబీపేట: బీబీపేట మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా తుజాల్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజ్ కుమార్ బుధవారం ఎన్నికయ్యారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వమోహన్, మండల ప్రధాన కార్యదర్శి బాలకిషన్, దోమకొండ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మండల అసోసియేట్ అధ్యక్షుడు మహిపాల్, ఎల్లం, రాజు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి సీఐగా రాజారెడ్డి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి సీఐగా రాజారెడ్డి బదిలీపై వస్తున్నట్లు పోలీసు వర్గాలు బుధవారం తెలిపాయి. ఎల్లారెడ్డి సీఐగా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న రవీందర్ నాయక్ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయగా.. ఆయన స్థానంలో మెదక్ డీసీఆర్‌బీలో ఉన్న రాజారెడ్డి ఎల్లారెడ్డి సీఐగా బదిలీ అయినట్లు వారు తెలిపారు.

ఆలయాభివృద్ధికి విరాళం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం హైదరాబాద్‌కు చెందిన వెంకటరెడ్డి–శాంత దంపతులు రూ.25 వేలు విరాళాన్ని బుధవారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. ఈవో ప్రభు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, అర్చకులున్నారు.

పాఠశాల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేట ఉన్నత పాఠశాలను బుధవారం డీఎల్‌పీవో సురేందర్ తనిఖీ చేశారు. ఉదయం ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, సామర్థ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పారిశుధ్య పనులు, సీజనల్ వ్యాధులపై గ్రామ పంచాయితీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన వెంట కార్యదర్శి అశ్వక్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

తాడ్వాయిలో ఆరోగ్య ఉప కేంద్రం..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం మండల వైద్యాధికారి కాశిం తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, మందులు, మాత్రలను అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఏఎస్‌ఎం సాబేరా బేగం, ఆశ వర్కర్లు ఉన్నారు.

దత్తనగర్‌లో ప్రాథమిక పాఠశాల..



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని దత్తనగర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆర్‌ఐ రవీందర్ పరిశీలించారు. పాఠశాల గుట్టకు ఆనుకొని ఉండడంతో కురిసిన వర్షం నీరు పాఠశాల ఆవరణలో ఆగుతున్నాయని, ఇబ్బందులు పడుతున్నామని హెచ్‌ఎం గంగాధర్.. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డిలకి వినతి పత్రం అందించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ పాఠశాల తనిఖీ చేసి ఆవరణలో నుంచి నీరు బయటకు వెళ్లే విధంగా కాలువ తీసి మొరం వేయిస్తామని.. ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

పొంచి ఉన్న ప్రమాదం.. ఎందుకింత నిర్లక్ష్యం

- పెచ్చులూడుతున్న మాచారెడ్డి ప్రాథమిక పాఠశాల భవనం
- బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



పెచ్చులూడిన పైకప్పు కింద కూర్చున్న విద్యార్థులు



శిథిలావస్థకు చేరిన మాచారెడ్డి ప్రాథమిక పాఠశాల భవనం

మాచారెడ్డి: విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందని అంటారు. కానీ అక్కడ విద్యార్థులు శిథిలావస్థకు చేరిన తరగతి గదిలో బిక్కుబిక్కుమంటూ విద్యనభ్యసిస్తున్నారు. మాచారెడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 80 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఏడు తరగతి గదులుండగా, ఆరు గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒక గది మాత్రమే బాగుంది. అన్ని తరగతుల విద్యార్థులను కొందరిని వరండాలో, మరికొందరిని ఒకే గదిలో కూర్చోబెట్టి తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఉన్న ఒక్క గది కూడా వర్షం వస్తే ఊరుస్తుందని, దాంతో పెచ్చులూడి పడుతున్నాయని పేర్కొంటున్నారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదులు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉంది. ఎప్పుడు వానొచ్చినా పెచ్చులూడి కింద పడతాయోనని దాంతో విద్యార్థులను ఇంటికి పంపిస్తున్నామని ఉపాధ్యాయులు అన్నారు. చాలా మంది తల్లిదండ్రులు భయపడి ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాల మరమ్మతులు చేయించాలని ఇటీవల మాచారెడ్డికి వచ్చిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు దృష్టికి తీసుకువెళ్లాం. ఎపుడు వర్షం వచ్చినా పిల్లల్ని ఇంటికి పంపించాల్సి వస్తోందని తెలిపాం. కొన్ని తరగతి గదులకు మరమ్మతులు చేయిస్తే బాగుంటుందని కలెక్టర్‌కు విన్నవించాం. అధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేయించాలి.

– పాత అశోక్‌కుమార్, హెచ్‌ఎం, మాచారెడ్డి

కాంగ్రెస్‌కు ఓటేసి తప్పు చేశామనుకుంటున్నారు

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింధే

మద్నూర్(జుక్కల్): ప్రజలు కాంగ్రెస్‌కి ఓటు వేసి తప్పు చేశామని అనుకుంటున్నారని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే వ్యాఖ్యానించారు. రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గురు ఫంక్షన్ హాల్‌లో బుధవారం మద్నూర్, డోంగ్లి మండలాల కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎమ్మెల్యే ప్రజలను మోసం చేసి అబద్ధపు హామీలు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినా ఇంత వరకు ఒక్క అభివృద్ధి పని చేయలేదన్నారు. నాన్ లోకల్ ఎమ్మెల్యే నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. మా ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు మంత్రులను తీసుకువచ్చి ప్రారంభోత్సవాలు చేస్తున్నారని అన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మాచారెడ్డి: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మాచారెడ్డి వైద్యాధికారి ఆదర్శ్ సూచించారు. బుధవారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పీఎంపీ, ఆర్‌ఎంపీల సమావేశంలో ఆయన మాట్లాడారు. మలేరియా, డెంగీ, కలరా వ్యాధులు పొంచి ఉన్నాయని పీఎంపీ, ఆర్‌ఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రులకు రోగులను పంపించాలని సూచించారు. పీఎంపీ ఆర్‌ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు దేవయ్య, సభ్యులు శంకర్, ప్రభాకర్, దశరథ్, చారి ఉన్నారు.

కుంగిన ట్రాన్స్‌ఫార్మర్ గద్దె



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఇటీవల నూతనంగా నిర్మించారు. ఆ గద్దె వర్షాలు కురియడం వల్ల భూమిలోకి కుంగి ఒక వైపునకు వంగింది. గద్దెపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడు కింద పడుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి ఎలాంటి స్పందన లేదు. ప్రమాదం జరిగితేనే స్పందిస్తారేమోనని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ ధరలకు అనుగుణంగా చెల్లించాలి



పిట్లంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు



నాగిరెడ్డిపేటలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు



నిజాంసాగర్‌లో తహసీల్దార్ భిక్షపతికి..



పెద్దకొడప్‌గల్‌లో తహసీల్దార్ దశరథ్‌కు..

పిట్లం(జుక్కల్): మార్కెట్ ధరలకు అనుగుణంగా స్లాబ్ రేట్లు ఇవ్వాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పిట్లంలో తహసీల్దార్ రాజ నరేందర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సరిపడా స్లాబ్ రేట్లు ఇవ్వకపోవడం వల్ల నష్టపోతున్నామని అన్నారు. అలాగే బకాయిలు విడుదల చేయాలని కోరారు. లేకపోతే ఈనెల 16 నుంచి నిరాహార దీక్షలు చేస్తామని తెలిపారు.

బిల్లులు చెల్లించాలి

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలో తహసీల్దార్ భిక్షపతి, ఎంఈవో తిరుపతిరెడ్డికి మధ్యాహ్న ఏజెన్సీల నిర్వాహకులు వినతి పత్రం అందజేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ దశరథ్‌కు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం రూ.10 వేల వేతనాన్ని అమలు చేయాలని, ప్రతి నెలా 5న బిల్లులు, వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నాగిరెడ్డిపేటలో ఏజెన్సీ నిర్వాహకుల నిరసన

కామారెడ్డి: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగిరెడ్డిపేటలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. తహసీల్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. తమకు నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని, నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వారు వినతి పత్రాన్ని అందజేశారు.

అధ్వానంగా ధర్మారావ్‌పేట్ బీటీ రోడ్డు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షపు నీరు బీటీ రోడ్డుపై పేరుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డుపై కనీసం ఒక తట్ట మొరం వేయడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రక్షిత మంచి నీటి ట్యాంక్ లీకేజీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ సమీపంలో కొన్ని రోజులు నుంచి రక్షిత మంచి నీటి ట్యాంక్ పైప్ లైప్ లీకేజీ అవుతుందని, పలుమార్లు పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ వల్ల ఇళ్లలోకి కుళాయి నీరు రావడం లేదన్నారు. ట్యాంక్ నుంచి నీరు ఓవర్‌ఫ్లో కావడంతో నీరు కలుషితమవుతుందని, లీకేజీని వెంటనే అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

‘క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలి’



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయ్‌కుమార్

కామారెడ్డి అర్బన్: తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని, క్రమశిక్షణ, పట్టుదల ఉంటేనే లక్ష్యాలను చేరుకోగలరని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్ కుమార్ అన్నారు. బుధవారం కళాశాల బాల్‌రాజ్ గౌడ్ ఆడిటోరియంలో డిగ్రీలో కొత్తగా చేరిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్య నైపుణ్యం, లక్ష్య నిర్దేశం, ఆరోగ్యం, పరిశుభ్రత, స్కాలర్‌షిప్‌ల గురించి వివిధ విభాగాల అధిపతులు వివరించారు. వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, అధ్యాపకులు జి.శ్రీనివాస్‌రావు, కె.శ్రీనివాస్, పి.విశ్వప్రసాద్, సుధాకర్, జయప్రకాష్, దినకర్‌చిన్న, రాములు, మానస, శ్రీవల్లి, రాజేందర్, రాజ్‌గంభీర్ రావు, శారద, చంద్రశేఖర్‌గౌడ్, సత్యం, కవిత, విజయ్, తబసుబేగం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి అదృశ్యం

మొయినాబాద్: గురుకుల కళాశాల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం మాదాపూర్‌కు చెందిన సున్నల్ పవన్ (17) చిలుకూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. బుధవారం ఉదయం టిఫిన్ చేసిన అనంతరం కళాశాల నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో ప్రిన్సిపల్ దేవేందర్, అధ్యాపకులు మొయినాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై భార్గవ్ గౌడ్

కామారెడ్డి: విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ సూచించారు. నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్‌వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి బుధవారం విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్‌లో చక్కగా చదువుకొని మంచి భవిష్యత్తును ఏర్పర్చుకోవాలన్నారు. డ్రగ్స్‌కు బానిసలైనవారు నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఎస్సైతో పాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో విద్యుత్ ఉద్యోగులు బుధవారం భోజన విరామ సమయంలో డీఈ కార్యాలయం ముందు ప్లకార్డులను పట్టుకుని నిరసన తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ టీజీపీఈజేసీ ఉద్యోగులు శశికాంత్, బాలకిషన్ తదితరులున్నారు.

రోడ్డుకు మరమ్మతులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

భిక్కనూరు: ‘చినుకు పడితే ఈ రోడ్డు చిత్తడే’ అనే శీర్షికతో ‘సాక్షి’ దినపత్రికలో ఈనెల 8న ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండల కేంద్రం నుంచి రామేశ్వర్‌పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు మరమ్మతు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం



తాడ్వాయిలో సంబురాలు జరుపుకుంటున్న మహిళా సంఘాల సభ్యులు



దోమకొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్



తిప్పారంలో పాల్గొన్న అధికారులు, మహిళలు

సాక్షి నెట్‌వర్క్: మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాలు, మండలాల్లో బుధవారం మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. అధికారులు హాజరై మాట్లాడారు. మహిళా సంఘాలు వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తుందని, తీసుకున్న రుణాలతో వ్యాపారాలు చేసి సకాలంలో బాకీ తీర్చాలన్నారు. పలు పథకాలపై అవగాహన కల్పించారు.

అటవీ చట్టాలపై అవగాహన



రాజంపేట: శేర్‌శంకర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో వీణ హాజరై మొక్కలు నాటారు. అనంతరం తండా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ అటవీ శాఖాధికారి రామక్రిష్ణ మాట్లాడుతూ..అటవి భూములను ఆక్రమించవద్దని సూచించారు. ఆర్డీవో వీణ మాట్లాడుతూ.. హక్కు పత్రాలు ఉన్నవారు మాత్రమే వ్యవసాయం చేసుకోవాలనితెలిపారు. తహసీల్దార్ జానకి, ఎఫ్ఆర్‌వో రమేష్, డీఆర్‌వో శ్రీధర్, సెక్షన్ అధికారి సయ్యద్ బాబా పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న నరాల వెంకట్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: వ్యవసాయ శాఖలో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ అగ్రికల్చర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్(టంసా) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వెంకట్‌రెడ్డితో పాటు సెంట్రల్ కమిటీ మెంబర్ కె.శివకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్‌లు పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులందరూ టీఎన్‌జీవోస్ సభ్యత్వం తీసుకునే విధంగా పనిచేయాలని వెంకట్‌రెడ్డి సూచించారు. ఉద్యోగుల హెల్త్‌కార్డులు, పెండింగ్ డీఏలు, బకాయిలను విడుదల చేసి సేవకు అంకితమైన ఉద్యోగులను ప్రభుత్వం కాపాడుకోవాలని ఆయన కోరారు.

నేడు పాదుకా పూజ మహోత్సవం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో గురువారం శబరిమాత పాదుకా పూజ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్త బృందాలతో భగవన్నామకీర్తనలతో భజన కార్యక్రమం ఉంటుందన్నారు. అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తం

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు గాంధారి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ పరమేశ్వర్ తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు ఉచిత నోటు పుస్తకాలు అందజేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మౌలిక సదుపాయాలతో పాటు ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందుతుందన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం హైద్రాబాద్‌లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను కలిశారు. పార్టీ అధికార ప్రతినిధి షౌకత్ అలీ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్, మరికొంతమంది నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు.

ఆత్మకూర్ హైస్కూల్‌లో మెహెందీ సంబురాలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్ హైస్కూల్‌లో బుధవారం మెహెందీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మెహెందీ ఆకులను తీసుకువచ్చి ఉపాధ్యాయినుల సహకారంతో పాఠశాలలో మెహిందీని తయారుచేశారు. దీంతోపాటు ఉపాధ్యాయినులు, విద్యార్థులు మెహెందీతో చేతులపై రకరకాల డిజైన్లను వేసుకున్నారు. హెచ్‌ఎం జబీనాతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సామ్యేల్ మాదిగ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పెన్షన్ రూ.4 వేలను వెంటనే బకాయిలతో కలిసి చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. నాయకులు పద్మారావు, యాదగిరి, సాయిలు, లక్ష్మి, లావణ్య, భూపతి తదితరులున్నారు.

రాజంపేటలో సామాజిక తనిఖీ

రాజంపేట: ఈజీఎస్ పనులకు సంబంధించి సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా పలు గ్రామాల్లో కొలతల వ్యత్యాసాలు గుర్తించారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంతకాలు, తీర్మానాలు లేకుండా ఉపాధి పనులు చేపట్టడం పట్ల ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, తనిఖీ అధికారులు ప్రదీప్ కుమార్, సురేష్, అనూష, భవాని, సంజయ్, పుల్‌దేవ్, ప్రభాకర్, జైపాల్, వెంకటేష్ పాల్గొన్నారు.